
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం - 32



# సాహిత్య శ్రామికుడు ఘండికోట బ్రహ్మాజీరావు

**ఘండికోట బ్రహ్మాజీరావుగారు 1922వ సంవత్సరం డిసెంబరు 23న పొందూరులో జన్మించారు. ఆయన రచన వ్యాసంగం 1937లో (ఆయన 15వ యేట) ప్రారంభమై నేటికీ అనగా ఆయన 88వ యేటి వరకు నిరంతరాయంగా సాగుతూనే ఉంది.**

**బ్రహ్మాజీరావు గారు ప్రాథమికంగా నవలా రచయిత. బహుముఖ మేధావి అయినందు వల్ల సుందరకాండకు తాత్పర్య సహిత వ్యాఖ్యానము, కేంద్ర సాహిత్య అకాడెమీ వారి 'వెయ్యిన్నొక్క రాత్రులు'ని అనువాదం చేసే ప్రక్రియలలో విశేష సాధన చేసేరు. వ్యక్తిగతంగా బ్రహ్మాజీరావుగారు సాధుస్వభావి, మృదుభాషి. కలిమినాడు సంతోషాన్ని పంచుకున్నాడే గాని లేమినాడు తన వ్యగ్రతను ఇతరులకు తెలియనిచ్చిన వాడు కాదు. నవ్య పాఠకుల కోసం వారి జీవితానుభవాలు.**

***మీ చిన్నతనం గురించి చెప్పండి?***

మా తల్లిదండ్రులు సుందరమ్మ లక్ష్మీనారాయణగార్లు. మా తాతగారు మంచి పండితుడు. ఆయన నాకు అమరకోశం, ఆంధ్ర నామ సంగ్రహం నేర్పించారు. ఇది నా సాహిత్య పురోగతికి దోహదం చేసింది.

***మీ రచనా వ్యాసంగం ఎప్పటి నుండి మొదలయింది?***

నేను 1937లో కాలేజీ చదువుతున్నప్పుడు కాలాపహాడ్ (నల్లకొండ)ని చదివి దానిని నాటకగా వ్రాశాను. అది కాలేజీ మేగజైన్‌లో వేసుకున్నారు.

***మీ వ్యక్తిగత జీవితం ఎలా సాగింది?***

నా జీవితం కష్టసుఖాల కలిమిలేముల కల

యిక. కష్ట సుఖాలన్నవి అందరి జీవితాల్లోనూ ఉండేవే అనుకోండి. నన్నూ, నా పిల్లల్ని (ఎనిమిది మంది) సంరక్షించే విషయంలో గాని, సంసార నిర్వహణలో గాని, ఆరోగ్య విషయాలలో గాని నా భార్య (సీతారామ) తోడ్పాటు ఇంతింత అని చెప్పలేను. ప్రతి పురుషుడి విజయం వెనక ఒక స్త్రీ హస్తం ఉంటుందని మేధావులు, అనుభవజ్ఞులు వచించారు. ఎందరు మహానుభావుల్ని అడిగినా ఆ స్త్రీ, ఆ పురుషుడి భార్యే అవుతున్నది. ఇందుకు నేను కూడా మినహాయింపు కాదు.

**మీ ఉద్యోగ జీవితం గురించి చెప్పండి?**

చాలా చిన్నచిన్న ఉద్యోగాల నుంచి మొదటి తరగతి గెజిటెడ్ ఆఫీసరుగా ఎదిగాను. ఎంత చిన్న పనులంటే మెషిన్‌షాపులో పని చేయడం, బంకర్లు కడగడం, రంగులు వేయడం అంత కిందనుండి అన్ని మెట్లు ఎక్కాను. ఇంజన్లను పరీక్షచేసే ఉద్యోగం చేయడం వల్లే శ్రామికులకు నా నుంచి ఇచ్చే బహుమతిగా ఒక మంచి నవలను రాశాను. అదే 'పరుగులిడే చక్రాలు – ప్రవహించే జీవితవాహిని'.

**మరి 'శ్రామిక శకటం' అని ఒకటుంది కదా! దాని సంగతేంటి?**

బాగుందండి. నేను రాసింది నా పని చుట్టూ ఉన్న శ్రామికుల గురించే కదా! అలాగే 'నవ్వింది నాగావళి' అనే నవలలో నాగావళి పరిసర ప్రాంతాలు, అక్కడి ప్రజల గురించి, స్వాతంత్ర్యము రాక ముందు అక్కడి పరిస్థితుల గురించి రాశాను.

**శ్రామికుల గురించి 'శ్రామిక శకటం' అనే నవలలో ఎంతో బాగా రాశారు. అంత బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉంటూ ఇది ఎలా సాధ్యపడింది?**

నాకు రైల్వే ద్వారా ఎన్నో పనులు నేర్చుకునే అవకాశం దొరికింది. తద్వారా నేను రైల్వే వారికి చేయగలిగినదీ అంటే శ్రామిక శకటం ద్వారానే అది తీరింది. ఆ నవల రాసి వాళ్ల ఋణం తీర్చుకున్నాననుకుంటున్నాను.

**మీరు డీజిల్ ఇంజన్ తయారీ గురించి ఆ కాలంలోనే అమెరికా వెళ్లారు కదా! ఆ అనుభవాలను మాతో పంచుకోగలరా?**

అవును, 1958లోనే నేను ఉద్యోగ నిమిత్తమై అంటే డీజిల్ ఇంజన్ తయారీ విధానం, దానిని సంగతి.

**చివరిగా ఒక్క ప్రశ్న. సాధారణంగా సప్తతి జరగడమే మనం చూస్తున్నాం. కాని మీకు అయిదు సాహిత్య సంస్థల ఆధ్వర్యంలో సాహితీ సప్తతి ఉత్సవమే జరిగింది. ఇది చాలా అరుదైన గౌరవం కదా!**

అవును. 2008 అక్టోబరు 2వ తారీఖునాడు అయిదు సాహిత్య సంస్థలు – ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, మొజాయిక్ సాహిత్యసంస్థ, సహృదయ సాహితీ, విశాఖ సాహితి, ఎస్కే ఫౌండేషన్ సంయుక్తంగా నా సాహితీ సప్తతి సమావేశం ఏర్పాటు చేశాయి. మీరన్నట్లు ఇది అరుదైన గౌరవం.

శ్రీమతి సీతారామతో....



## నచ్చినవి

| | | |
|---|---|---|
| కథానిక | – | వేలుపిళ్ళై – (సి.రామచంద్రరావు) |
| నవల | – | ఏకవీర – (విశ్వనాథ సత్యనారాయణ) |
| నటుడు | – | గ్రిగరీపెక్ |
| సినిమా | – | మల్లీశ్వరి (భానుమతి, ఎన్.టి.ఆర్) |
| హీరోయిన్ | – | భానుమతి |
| హీరో | – | అక్కినేని నాగేశ్వరరావు |
| పాటలు | – | త్యాగరాజకృతులు, అన్నమాచార్య కీర్తనలు |
| ఎలక్ట్రానిక్ వస్తువు | – | లాప్‌టాప్ |
| నచ్చిన కూర | – | గుత్తివంకాయ |

నడిపే శిక్షణ కొరకూ కూడా ఎనిమిది మందిమి అమెరికా వెళ్లాము.

ఆ తర్వాత రెండవ తరగతి గజిటెడ్ ఆఫీసరుగా విశాఖపట్నం వచ్చాను. ఆ తర్వాత కార్ఖానాలో మొదటి తరగతి ఆఫీసరుగా ప్రమోషన్‌పొందాను. ఆ శిక్షణ ఆధారంగా ఖర్గపూర్ ఐఐటిలో మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకి పాఠాలుచెప్పే అవకాశం దొరికింది. క్రమంగా డీజిల్ ఇంజన్ల సంఖ్య తగ్గి ఎలక్ట్రికల్ ఇంజన్లు వచ్చాయి. అది వేరే

***

అందరిలాగే భోజనం, స్నానం, సంధ్యావందనం మొదలైన నిత్యకర్మల అనుష్ఠానం పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆ సంబంధమైన లావాదేవీలు అన్నిటితో బాటు రచనా వ్యాసంగాన్ని కూడా ఒకానొక ధర్మంగా (డ్యూటీ) బాధ్యతగా స్వీకరించి అనుష్టిస్తున్న అసామాన్య శ్రామికుడు, శ్రమలో ఫలముందని గ్రహించిన కర్మయోగి.

పైన చెప్పిన అమూల్య గ్రంథాలతో బాటు సుమారు 120 కథలు వ్రాసారు. అంతేకాక ఆయన నవలల గురించి ఐదు డాక్టరేటు పరిశోధన గ్రంధాలు, కథల గురించి రెండు, వెలువడి ఆయా సాహిత్య ఔత్సాహికులకు ధన్యతను చేకూర్చాయి.

–ఎస్. కనకలత

నాకు నచ్చిన నా కథ

# కావేరీ సేతురామన్

- ఘండికోట బ్రహ్మాజీరావు

**కావేరీ తీరంలో తన్మయత్వంలో పులకిస్తూ త్యాగరాజస్వామి కీర్తనలనాలాపించిన ముద్దరాలు మల్లికను - లోకం అలానే ఉండనిస్తుందా? అమాయకులను దోపిడీ చేయడమే గదా సమర్థుల సాంప్రదాయం. ఈ మాత్రం పనికి, కమలనాథన్ అయితే నేమి? సేతురామన్ అయితేనేమి? గొంతుకోసుకోవడానికి ఏ కత్తి అయినా ఒకటే గదా!**

**గానసభ సంపన్నమయింది.**

**మంత్రిగారిని కారుదాక దిగబెట్టి రావడానికి కమలనాథన్ హాలు విడిచి వెళ్లాడు.**

**కావేరీ కమలనాథన్ రుమాలుతో ముఖం తుడుచుకొని అభిమానులకు ఆటోగ్రాపు పుస్తకాల మీద సంతకాలు చేస్తున్నది.**

హాలులో జనం పలుచబడ్డారు.

అభిమానుల క్యూలో రాజశేఖరం కొంచెం వెనుకనున్నాడు. కమలనాథన్ వస్తే మరీ అవకాశం దొరకదు.

వయొలినిస్టు, మార్దంగికుడు మొదలైన వాళ్లు వాయిద్యాలు కేసుల్లోను, వెల్వెట్ కవర్లలోను పెట్టి సావకాశంగ కూర్చున్నారు.

రాజశేఖరం దగ్గిర ఆటోగ్రాపు పుస్తకం లేదు. కనీసం మంచి కాగితం కూడా లేదు. పర్సులో తన విజిటింగ్ కార్డు తీసి పట్టుకున్నాడు.

కావేరీదేవి తలవంచుకుని సంతకాలు చేస్తున్నది.

''నా దగ్గిర ఆటోగ్రాపు పుస్తకం లేదు. దయచేసి ఈ కార్డు వెనుక...''

రాజశేఖరం మాటలు పూర్తి కాలేదు.

కావేరీదేవి సంతకం పెట్టకుండా, కార్డును తిప్పి దానిమీద నున్న పేరు చదివింది. తలెత్తి రాజశేఖరం ముఖంలోకి చూసింది ఒక్క నిమిషం. క్యూలో వెనుక నున్న అభిమానులు తొందర పడుతున్నారు.

కావేరీదేవి ఇవేవీ గమనించినట్లు లేదు.

''రాజశేఖరం! అమ్మగారు బాగున్నారా?'' ఆమె ప్రశ్నించింది. రాజశేఖరం తన చెవులను తాను నమ్మలేకపోయాడు. ఈ కావేరీదేవి ఇంత పరిచయంతో మాట్లాడుతున్నందుకు ఏం జవాబు చెప్పాలో ఆయనకు తోచలేదు.

''పెళ్లి చేసుకున్నావా? పిల్లలా'' ఆమె మళ్లీ అడిగింది.

రాజశేఖరం జవాబు చెప్పలేక పోయాడు.

మరో నిమిషం ఆయన ముఖంలోకి చూస్తూ ఆమె ఉండిపోయింది.

''చాలా ఏళ్లయింది. అయినా అప్పటికీ ఇప్పటికీ నువ్వు మారిపోలేదు...'' ఆమె ఇంకా ఏదో చెప్పబోయింది.

క్యూలో వెనుక నున్నవాళ్లు బహిరంగంగా తమ అసహనాన్ని వెలిబుచ్చుతూ రాజశేఖరాన్ని పక్కకి తప్పించడానికి ప్రయత్నించారు.

ఇంతలో కమలనాథన్ రానే వచ్చాడు. హఠాత్తుగా అన్నీ ఆగిపోయాయి. నిమిషాలలో హాలు ఖాళీ అయిపోయింది.

రాజశేఖరం పేపర్లలో కావేరీదేవి కౌశలం గురించి చదవడమే కాని ఇంత వరకు ఆమె కచేరీకి వెళ్లలేదు. ఈసారి ఓ స్నేహితుడు తొందరగా మరో ఊరు వెళ్తూ నూరు రూపాయల టిక్కట్లు ఇవ్వడం చేత తను వచ్చాడు. లేకపోతే వచ్చి ఉండేవాడు కాడు.

ఆ రాత్రి ఆలోచనలతో ఆయనకు నిద్ర దూరమయింది.

''చాల ఏళ్లయింది...'' కావేరీదేవి మాటలు ఇంకా ఆయన చెవులలో సన్నాయి నొక్కులు నొక్కుతున్నాయి.

చాలాకాలం క్రిందట.... అంటే పదేళ్లవుతుంది ఈ జనవరికి. తను మద్రాసు వచ్చి రెండు సంవత్సరాలవుతుంది. తనకి నెల్లూరులో మంచి ఇల్లు, ఒక అక్క ఒక చెల్లెలు, తల్లీ ఉన్నా, ఉద్యోగం మాత్రం మద్రాసులో దొరికింది. త్యాగరాయ నగర్ బ్రాంచిలో ఆయనను వేశారు. ఆ రోజుల్లో మద్రాసు అంత ఖరీదుగా లేదు. ఒక గది అద్దెకు దొరికింది. హోటలు భోజనం సరిపడకపోతే ఇంటి వాళ్లే పేయింగ్ గెస్టుగా స్వీకరించడం చేత ఆ ఇబ్బంది కూడా తప్పింది. ప్రతివారం సెలవుల్లో నెల్లూరు వెళ్లి తన వాళ్లతో గడిపి వస్తూ ఉండడం చేత కుటుంబానికి దూరమయ్యానన్న ఆలోచన కూడా ఆయనకు కలగలేదు

క్రమబద్ధమైన జీవితం - మంచి ఉద్యోగం - అక్కయ్యకు పెళ్ళికాలేదన్న కించ అప్పుడప్పుడు కలిగినా, అది కూడా తీరిపోయింది. ఒక మంచి సంబంధం వచ్చింది. ముహూర్తాలు పెట్టారు. అన్నీ సవ్యంగా ఉన్నాయనుకుంటే...

ఒకనాటి రాత్రి రాజశేఖరం జీవితం అస్తవ్యస్తమయింది. బాంకు పనిమీద తంజావూరు వెళ్లవలసి వచ్చింది.

ఎగ్మూరు స్టేషనులో రామేశ్వరం ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషను లేకుండా, ఆఖరి నిమిషంలో రైలు వేగాన్ని పుంజుకుంటుంటే, ఒక రెండవ తరగతి పెట్టెలో ఎక్కడానికి ఆయన ప్రయత్నించాడు. లోపలినుండి ఎవరో చేయి పట్టి లాగకపోతే ప్లాట్‌ఫారమ్ మీద పడిపోయే వాడు.

అప్పుడు తనను లోపలికి లాగిన వ్యక్తి వేపు చూశాడు.

''నిండు ప్రాణం నిష్కారణంగా....'' అరవంలో ఆమె అంటున్నది. తన ముఖంలోకి చూస్తూ ఆమె మరి మాట్లాడలేదు.

లోపల నవ్వులు.

''ఇది ఆడవాళ్ళ పెట్టె'' నడివయసులో ఆమె అంటున్నది.

''వచ్చే హాల్టులో దిగిపో'' మరొక ఆమె అంది అదే భాషలో, తాంబరం మరో అరగంట తరువాత వస్తుంది. మీటరు గేజ్ రైల్ పెట్టెలో లగేజి షెల్పులలో పక్కవాయిద్యాలు.

ఆయన దృష్టి ఎంత మరలించుకుందామన్నా తనను కాపాడిన అమ్మాయి వైపే తిరుగుతున్నది.

''మల్లికా! నువ్వేం పాడతావే. ఆరాధనోత్సవాలలో?'' నడి వయసు ఆమె అడిగింది.

''నేను సంగీతం నేర్చుకోలేదు. అందరూ పాడేవాళ్లు, వాయిద్యాలు వాయించే వాళ్లు అయితే వినే వాళ్లుండద్దూ?'' మల్లిక నవ్వుతూ అంటే రాజశేఖరం ఆశ్చర్యపోయాడు.

తనకి వచ్చీరాని అరవం - ఆ పెట్టెలో కూర్చున్న వాళ్లందరూ తంజావూరు వెళ్తున్నారు. అక్కడేవో ఆరాధనోత్సవాలు, సంగీత సభలు - వాటిలో వాళ్లందరూ పాల్గొంటారు - తను, మల్లిక వంటి శ్రోతలు తప్ప.

నడి వయసులోని ఆమె జానకి. ఆమె మద్రాసులో ఒక సంగీత కళాశాల ప్రిన్సిపాలుగా పని చేస్తున్నారు. గాత్ర సంగీతంలో ఆమె నిధి. కంపార్టుమెంటు

నిండా సంగీత కళాశాల లెక్చరర్లు, సీనియరు విద్యార్థినులు.

మాటలలో పడి, వాళ్లు తాంబరంలో రైలాగిన సంగతి, విడిచి పెట్టిన సంగతి గమనించలేదు. వాళ్లందరి మధ్య మగవాడు తానొక్కడే ఉండడం అతనికి రుచించలేదు.

మల్లికకు ఎదురుగా తలుపును ఆనుకొని ఆయన నిలబడ్డాడు. రైలు వేగంగా పోతున్నది. అర్ధరాత్రి తరువాత కుదుపు జోగెడుతుంటే ఒకరొకరూ కూర్చున్న చోటునే నిద్రలోకి జారుకుంటున్నారు.

అపుడప్పుడు తెలివి వస్తే మల్లిక తనవేపు చూస్తున్నది. ఆ చూపులో అభయమిస్తున్నట్లు ఆయనకు స్ఫురించింది. తను మాత్రం వెర్రెత్తినట్లు, ఎవరేమనుకుంటారో అన్న ఆలోచన లేకుండా మల్లికను చూస్తూనే ఉండిపోయాడు.

ఆయనకు కవిత్వం రాదు – కాని చాలా కావ్యాలు చదువుకున్నాడు. అవేవో తలపులు.

చరమ సంధ్యా కాల సంపుల్ల మల్లికాస్త ఒకపంక్తి – మల్లిక
శరదాగమారంభ సంపూర్ణ పూర్ణిమా శశివదన – మల్లిక
దివిజ గంగా నదీ శీకరస్నాత కాంచన పద్మముఖి – మల్లిక
నిబిడ కాదంబినీ నిర్గత తటిల్లత – మల్లిక

తనలా నిలుచునే ఉన్నాడు. లోపలివాళ్లు ఇరుక్కుని కూర్చున్నారు. ఆడవాళ్ల మధ్య తనెలా కూర్చోగలడు? తను చాలా అదృష్టవంతుడు. ఏ టికెట్టు కలెక్టరూ వచ్చి ఆడవాళ్ల పెట్టె నుండి దింపేయలేదు.

తెల్లవారు వేళ నాలుగు గంటలకి రైలు తంజావూరు చేరుకుంది.

అందరూ తొందర తొందరగా లేచి సామానుదింపుకుంటున్నారు. తను, మల్లిక వీణలను ఇతర వాద్యాలను అందించి సాయం చేస్తుంటే వాళ్లెవరూ కాదనలేదు.

ఆఖరున వాళ్లిద్దరూ దిగారు.

''మీరు కూడా తిరువయ్యారు వస్తున్నారా?'' మల్లిక అడిగింది.

''తిరువయ్యారా?'' ఆయన ఆశ్చర్యం ప్రకటించాడు.

''అక్కడ త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరుగుతాయి''

''అలాగా!''

గేటు దగ్గిర నిలబడి జానకి గట్టిగా పిలుస్తున్నది. ''మల్లికా!'' మల్లిక పరుగెత్తి వెళ్లిపోయింది.

పుష్యమాసం – చలిగా ఉంది. – పాడ్యమి చంద్రుడు వెలవెలబోతున్నాడు, అస్త్రాద్రివేపు జారుతూ.

వాళ్లందరూ తమ కోసం వచ్చిన బస్సులో ఎక్కివెళ్లిపోయారు.

తను మతిపోయినట్లు రెండో తరగతి వెయిటింగ్ హాలులో బాగా వెలుతురు వచ్చే వరకు కూర్చొని, తరువాత రిక్షా చేయించుకొని హోటల్‌కి వెళ్లిపోయాడు.



రాత్రల్లా నిలబడి ప్రయాణం చేశాడేమో, హాయిగా మల్లికను తలచుకుంటూ హోటలు గదిలో పడుకోవాలనుకున్నాడు. పని మీద వచ్చినప్పుడు ఇటువంటి సుఖాలు అందరికీ లభించవు.

తాను రాత్రి వరకు శ్రమపడి పని ముగించుకొని హోటల్‌కి తిరిగి వచ్చాడు. వేడి నీళ్ల స్నానం చేసి, భోజనం చేసినదే పాటు నిద్రకు ఉపక్రమించాడు.

ఉదయం లేచేసరికి ఆయన చాలా తాజాగా ఉన్నాడు. స్నానం, టిఫిన్ అన్నీ ముగించి, ఎనిమిదిన్నరకు, హోటలు వాళ్లు చెప్పిన చోటికిపోయి తిరువయ్యారు పోయే బస్సు ఎక్కాడు.

తమిళనాడుకి ధాన్యాగారం తంజావూరు జిల్లా. నగరం దాటిన నుండి ప్రకృతి ఆకు పచ్చని మేలిమి పట్టుచీర కట్టుకొని దర్శన మిచ్చింది. వరి పొలాలు, అరటి తోటలు, మామిడితోటలు, కొబ్బరి తోపులు – ఆ రోడ్డు మెలికలు తిరిగి వాటి మధ్య నుంచి పరుగెత్తి పరుగెత్తి కావేరీనది మీద వంతెన దాటి గ్రామం ప్రవేశించింది.

''తిరువయ్యారు'' కండక్టరు అరుస్తున్నాడు.

తను తొందరగా లేచి దిగబోతుంటే కండక్టరడిగాడు.

''సద్గురు సమాధికా?''

అవునంటూ తను తలూపాడు.

''అయితే నెక్స్‌ట్ స్టాఫ్''

రెండో స్టాపు దగ్గిర చాలామంది దిగారు. వారితో పాటు తనూ దిగాడు. ఒక సందులో పడి అందరూ నడుస్తున్నారు. కొందరు వయొలిన్లు, కొందరు తంబురాలు, కొందరు అలంకరించిన వీణలు, ఇంకా ఇతరవాయిద్యాలు, మెరుస్తున్న కేసులలో ముఖమల్ కవర్లలో, వాటిని మోసుకుంటూ జంటలుగా, ఒంటరిగా, చిన్నలు, పెద్దలు, ఆడాళ్లు, మగాళ్లు, సంగీత శాస్త్రజ్ఞులు సంగీతప్రియులు, రసికులు, అందరూ కిక్కిరిసి ఆ సందులో సద్గురు సమాధివేపు నడుస్తున్నారు.

రాత్రికిరాత్రి దారికి ఇరుపక్కల కుక్కగొడుగుల్లా పాకలు లేచాయి – పై కప్పులకు కొబ్బరాకుల చాపలు, స్తంభాలకు వెదురుబొంగులు – ఒక కాఫీ హోటల్ – చిన్నచిన్న బొమ్మలమ్మే దుకాణం – ఒక దానిలో సంగీత గ్రంథాలు, వాగ్గేయకారుల వర్ణ చిత్రాలు – పుస్తకాలలో నూటికి తొంభై పాళ్లు తమిళంలో, కన్నడంలో కొన్ని, ఒకటో రెండో తెలుగులో, మిగిలినవి ఇంగ్లీషులో – కొన్నిటిలో స్వరప్రసారం కూడా ఉంది. కాని, చాలావాటిలో సాహిత్యమే ఉంది. అన్నీ అందుబాటులో లేని ధరలలో – అప్పటికీ తను త్యాగరాజస్వామి వారి వర్ణ చిత్రం పెద్ద సైజుదీ, వాగ్గేయకారుల జీవిత చరిత్రలున్న గ్రంథమూ కొన్నాడు.



అప్పటికే పదయింది. ఒకపాకలో దూరి కాఫీ తాగి, ముందుకు నడిచాడు గుంపుతో, సమాధి ఇంకా ఫర్లాంగు దూరం ఉండగా, ఎడమచేతి వేపు పూరింటి పక్క నుంచి పోతుంటే అరుగు మీద కూర్చున్న ఒకమ్మాయి ఆయన చేయి పట్టుకొని ఆపింది.

''మీరెప్పుడు వచ్చారు?'' అడిగింది.

ఆయన ఆశ్చర్యానికి అంతులేదు.

''మల్లికా! ఇక్కడ ఉండడం?''

''ఇక్కడే! ఈ ఇల్లు ఎవరిదో తెలుసా? త్యాగరాజస్వామి వారి బంధువులు. నాలుగో తరమో, అయిదో తరమో, వారిది. త్యాగయ్య అన్నగారి వంశం వాళ్లు. ఈ ఇల్లు వారిదే. ఆరాధనోత్సవాలలో పాల్గొనే పెద్దపెద్ద విద్వాంసులు వీరి ఇంటే బస చేస్తారు. మనకు తోచినది ఇస్తే భోజనం కూడా పెడతారు. ఇంతకీ మీరెక్కడ దిగారు?''

''తంజావూరులో – హోటల్ గది తీసుకున్నాను. మిమ్మల్ని చూడాలని వచ్చాను''.

''మీకు సంగీతమంటే ఇష్టమేనా?''

''ఒల్లు మరచిపోతాను''

''నాలుగుయిదు రోజులుండగలరా?''

ఆయన ఆలోచించాడు.

''బహుశా...''

''మరేం అనకండి. తప్పకుండా ఉండండి. మీరు కొంచెం డబ్బు ఖర్చు పెడితే భోజనం, బస ఇక్కడ ఏర్పాటుచేస్తాను. నేను మూడు సంవత్సరాలయి ఈ ఉత్సవాలకు వస్తున్నాను. మీకీ ఊరంతా చూపిస్తాను. పంచనదేశ్వరుని ఆలయం, అయ్యవారి ఇల్లు, బజారులు చూపిస్తాను. మీకు బోరు కొడితే తోటలలో నడిచి రావచ్చు''.

ఆయన కాదనలేకపోయాడు. పగలు సంగీతం విని రాత్రికి తంజావూరు వెళ్లిపోదామను కున్నాడు. చేతి సంచిలో మరొక జత బట్టలు, తువాలు, సబ్బు – అంతకుమించి మరేవీ ఆయన తెచ్చుకోలేదు.

సాయంకాలం ఎవరో మహా సంగీత విద్వాంసుడు త్యాగయ్యగారి పటం దగ్గిర జ్యోతి వెలిగించాడు. మంత్రివర్యులెవరో ఉత్సవాలు ప్రారంభించారు. తరువాత నాదస్వరం – ఉపన్యాసకుడు తెలుగులో త్యాగరాజకీర్తనలు పాడి తమిళంలో వ్యాఖ్యానించాడు.

త్యాగరాజస్వామి వారి సమాధికి, వారి శిష్యురాలి సమాధికి మధ్య కావేరీ నది గట్టున చాలా పెద్ద పందిరి వేశారు. పదివేల మంది సులువుగా కూర్చోడానికి సరిపోయినంత పందిరి – అందరూ నేల, ఇసుకమీద కూర్చున్నారు. ఆడవాళ్లకు మగవాళ్లకు మధ్య అడ్డు కట్టారు. విద్యుద్దీపాలంకరణ ప్రత్యేకంగా ఉంది. కళ్లుమిరుమిట్లు గొలిపే కాంతిలో మహిళలు కట్టుకున్న పట్టుచీరల రంగులు దివ్యంగా కనిపించాయి. వారి చెవులకు, ముక్కులకున్న ఆభరణాలలోని వజ్రాలు తళ్కులీనాయి.

ఈ సంగీతోత్సవాలు ఇంత అద్భుతంగా జరుగుతాయని కలలో కూడా అనుకోలేదు.

మల్లిక చేసిన ఉపకారం మరిచిపోలేనిది. తాను వీధి అరుగుమీద పడుకుంటే ఆమె తెచ్చుకున్న ఒక్క దుప్పటి ఆయనకిచ్చి చాలా సహాయం చేసింది. ఊరల్లా చూపించింది. పుష్యమాసం – బజారునిండా కూరలే.

ఇదో దివ్యమైన అనుభూతి. అది మూడో రోజు కాబోలు. ఆయన కొంచెం వెనక్కు కూర్చున్నాడు. ఆడవాళ్ల వేపు మల్లిక కూర్చుంది. రాత్రి తొమ్మిది గంటలకు భోజనానికని ఇద్దరూ బసకు వెళ్లారు. తిరిగి వాళ్లు పందిటికీ రాలేదు. కొంచెం వెనక్కు వెళ్లి కావేరీ నది గట్టున, రేవులో పావంచాల మీద కూర్చున్నారు.

బహుళ తదియనాటి చంద్రుడు ఆకాశం మీద ఎగ్రబాకుతున్నాడు. చల్లని గాలి కావేరి జలాల మీంచి వస్తున్నది. దూరంగా పందిటిలో వెలుతురూ, మైకులలోంచి సంగీతమూ వస్తున్నాయి.

ఇద్దరూ దగ్గిరగా కూర్చున్నా ఒకరికొకరు తగలడం లేదు.

''రాజశేఖరం! ప్రిన్సిపాలు జానకిగారితో రావడం చాల మేలయింది. ఆవిడ మానాన్నా ఎవరో విద్వాంసులను కలుస్తూ ఉంటారు. ఏవోచర్చలు – నాకు

ఎంతో స్వేచ్ఛ – ఆ స్టూడెంట్సుతో ఉంటే నన్ను తినేసి ఉందురు. అందుచేత మిమ్మల్ని కలియడానికి...''

''మల్లికా! మనం కలిసిన వేళ అపూర్వమైనది. మనం 'మీరు' అని గౌర వించు కుంటూంటే దూరంగా ఉన్నట్లుంది''.

''అవును రాజశేఖరం''

''నీకు సంగీతం రాదా?''

''అంటే?''

''పాడడం అసలే రాదా?''

''నాకు శాస్త్రం రాదన్నాను కాని పాడడం రాదన్నానా?''

''నిజంగా?''

''వింటావా?''

మల్లిక పాడింది. త్యాగరాజకృతే పాడింది. 'నగుమోము కనలేని' పాడింది.

రాజశేఖరం చైతన్యం లేకుండా ఉండిపోయాడు. 'ఏకాంతమైన ప్రదేశం – రమ్యమైన వాతావరణం – మల్లిక హృదయం నుండి అమృతవృష్టిని కురిపిస్తూ వెలువడింది గానం.

తన్మయతలోంచి ఈ లోకంలోకి ఆయన వచ్చేసరికి చాలా సేపు పట్టింది.

''మల్లికా!'' ఆమె, ఆయన ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది.

''మల్లికా! ఇంతగా మనసు కదిలించేటట్లు నువ్వు పాడతావని అనుకోలేదు. త్యాగయ్య గారు వింటే పరవశిస్తారు''.

''ఇప్పుడు మాత్రం ఆయన వినడం లేదనా?'' నవ్వుతూ అంది.

''మరి సంగీతం రాదంటావేమిటి?''

''అవును. నాకు సరిగమలు, రాగాలు, సంగతులు ఇవేవీ రావు. అందుచేత ఈ కీర్తనలు అందరి ఎదుటా పాడను''.

''పోనీ, ఉత్సవాలలో పాడడానికి పేరివ్వకూడదా?''

మల్లిక నవ్వింది. నవ్వి, నవ్వి మెల్లగా అంది. ''ఈ విధంగానైనా నన్ను బత కనియ్యవా? వేదిక నెక్కి నవ్వుల పాలు కమ్మంటావా''.

''ఆ సంగీత విద్వాంసులకు శాస్త్రమే తెలుసు. శ్రావ్యమైన గళం లేదు. నువ్వు చాలా గొప్పదానివవుతావు. చాలా పెద్ద, పెద్ద...''

''అవన్నీ దేనికిలే. మరో కీర్తన పాడమన్నావా?'' మల్లిక 'సీతమ్మ మాయమ్మ' పాడింది. రాజశేఖరం ఆనందసాగర తరంగాలపై ఊయల లూగాడు.

ఆ రాత్రికి సంగీతోత్సవాలు సంపన్నమయినట్లున్నాయి.

పందిట్లో కలకలం, వాళ్లిద్దరూ తొందరగా ప్రజల వేపు అడుగులు వేశారు.

మరునాటి రాత్రి, ఆ తరువాత రాత్రి వాళ్ళిద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. మల్లిక పాడడం – రాజశేఖరం మంత్రించిన భోగీశ్వరుడివలె వినడం!

బహుళ పంచమి నాడు అర్ధరాత్రి వరకు కావేరి గట్టున వాళ్ళు కూర్చున్నారు. ఏవో తన మనసులోని భావాలు మల్లిక చెప్పింది. అర్ధరాత్రి తరువాత త్యాగరా జస్వామి వారి ఆలయంలో మగవాళ్లు పైటలవలె కండువాలు కప్పుకొని, కృష్ణ పరమాత్మపై మధురభక్తిని ప్రదర్శిస్తూ, తాము గోపికలైనట్లు నాట్యం చేస్తూ పర వశించారు.

తరువాత బిందెలతో కావేరీ జలాలు తెచ్చి అభిషేకం చేశారు. రాత్రంతా జాగరం చేసి, ఉదయమే కావేరిలో స్నానం చేసి, రాజశేఖరం మల్లికతో కలిసి పందిటివేపు నడుస్తుంటే మైకులో అనౌన్సుమెంటు వినిపించింది.

''మద్రాసు త్యాగరాయనగర్ బ్రాంచి కాషియర్, మిస్టర్ రాజశేఖరం – మీకో అర్జంటు టెలిగ్రాము పట్టుకొని హోటలు మేనేజరు వచ్చారు. మీ తల్లిగారి ఆరోగ్యం ప్రమాదస్థితిలో ఉంది. వెంటనే రిసెప్షనిస్టు దగ్గరికి రావలసింది''.

మల్లిక రాజశేఖరం ముఖంలోకి చూసింది.

రాజశేఖరం ముందుకు నడిచాడు.

ఆ విధంగా వాళ్లిద్దరు తిరువయ్యారులో విడిపోయారు. తల్లిగారికి పక్ష వాతం వచ్చింది. అక్కయ్యకు పెళ్ళయింది. మరో నెలలో చెల్లెలికి పెళ్లయింది. రాజశేఖరం పెళ్లి చూడకుండానే తల్లిగారు కన్నుమూశారు. ఆవిడ పోవడంతో రాజశేఖరాన్ని పెళ్లిచేసుకోమని అడిగేవాళ్లు లేకుండా పోయారు.

ఆరునెలల తరువాత ఆయన యథాస్థానంలో ఉద్యోగంలో చేరాడు. చిన్న ఇల్లు తీసుకున్నాడు. మల్లికతో గడిపిన మధుర క్షణాలు తలుచుకుంటూ ఒంట రిగా ఉండిపోయాడు.

## కథాంతరంగం



1982 జనవరి. మద్రాసులో ఉన్న పెరంబూరు ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఒక సమస్య వచ్చినప్పుడు నేను సౌత్ ఈస్టరన్ రైల్వేకి సంబంధించిన అధికారినే అయినా సదర్న్ రైల్వే నుండి నాకు ఆ సమస్య పరిష్కారానికి గాను పిలుపు వచ్చింది. నేను ప్రయాణం చేసిన బోగీలోనే ఎదుటి బెర్త్‌లో ఒక భద్ర మహిళ ఉంది. చూడగానే ఆవిడ తమిళ ప్రాంతానికి చెందినదే అని తెలిసిపోయింది. సంభాషణ ఆవిడే ప్రారంభించింది. ''బాబూగారూ, మీరు కూడా మద్రాసే వెళుతున్నారా'' అని, ఇంగ్లీషులో. ఆ తరువాత జరిగిన సంభాషణలో ఆమె కర్ణాటక సంగీత బాణీలో కీర్తిమంతురాలైన గాయని అనీ ఐదారు రోజులలో తమిళనాడులోని తిరువయ్యారులో సద్గురు శ్రీ త్యాగరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో జరిగే వార్షిక త్యాగరాయ ఆరాధనోత్సవాలలో గానం చేయడానికి గాను ఉత్సవ సంఘం వారి అధికారిక ఆహ్వానం మేరకు ఆమె కలకత్తా నుండి వస్తున్న దని తెలిసింది. గాన పాండిత్యానికి అతీతంగా ఆమెకు వ్యక్తిగత జీవి తంలో కొన్ని చీకాకులూ చీదరలు సంభవించాయని కూడా ఆమె 'పితృ సమాన వయస్కుడయిన' నాతో కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పింది. సంగీతం, సౌందర్యం ఒకాయనను ఆకర్షించినా అతనితో వివాహం వంటిది జరిగినా, క్రమంగా ఆ అనుబంధం వ్యాపార బంధమేనని ఆమెకు తెలిసినా నిస్సహాయంగా అతనితో కొన్నేళ్లు ఉండిపోయింది. తరువాత ఇంకొకరి ఆలంబనకు చేరి అక్కడ ఇంకా హీనమైన వ్యావృత్తికి అనిష్టంగా చేరిపోయింది. ఒకసారి పోలీసుల దృష్టిలో కూడా పడింది.

ఆ నిస్సహాయ కళాకారిణి జీవితంలోని వృత్తాంతాలు ఆధారంగా పేర్లూ, ఊర్లూ మార్చి ఈ కథ వ్రాశాను. నాకు సంతృప్తినిచ్చిన నా కథ లలో ఇది ఒకటి. ఈ కథ తొలిసారిగా ఆంధ్రప్రభ వీక్లీలో మార్చి 1997లో వచ్చింది.

–ఘండికోట బ్రహ్మాజీరావు

మల్లిక ఎప్పుడు సంగీతం నేర్చుకుంది? ఎప్పుడు కావేరిదేవిగా మారింది? ఎప్పుడు కమలనాభన్‌ని పెళ్లాడింది?

అన్ని ప్రశ్నలే. వేటికీ సమాధానాలు లేవు. మల్లిక మనసులో దాచుకున్న సంగతులెన్నో చెప్పింది.

''నీ వంటివాడిని పెళ్లాడితే, నా పాటలు మనసుదీరా వినిపిస్తాను. చాలా మంది భర్తలు తమ పెళ్లాలు బాగా పాడితే సహించలేరు''.

''రాజశేఖరం! ఈ ఆరాధనోత్సవాలు ముగుస్తాయి. ఈ సంగీత ప్రియు లంతా ఈ పరిసరాలను పాడుచేసి వెళ్లిపోతారు. ఈ దుర్గంధం పోవడానికి ఒక నెల్లాళ్లు పడుతుంది. మళ్లీ ఈ ప్రదేశంలో పవిత్రమైన వాతావరణం నెలకొం టుంది. ఈ కావేరిదేవి ఎంత పూజ్యురాలో తెలుసా? తిరువయ్యారును చుట్టే ఈ నదీమతల్లి త్యాగరాజస్వామి వారి ఆనందాన్ని దుఃఖాన్ని పంచుకుంది. అయ్య వారి కథలు చాలా ఆమెకు తెలుసు. గంటల కొద్దీ సంగీత విద్వాంసుల సమ క్షంలో ఆయన ఆలపించిన రాగం గురించి ఆమెకు తెలుసు. సద్గురువు అక్షయ పాత్రలో తంజావూరి ప్రభువు బంగారు నాణాలు వేయిస్తే, ఆయన కోపంతో వాటిని పారబోయడం ఈ తల్లికి తెలుసు. త్యాగయ్య అన్నగారు సీతారాముల విగ్రహాలను తన ముఖం మీద పారేస్తే వాటిని తిరిగి సాదరంగా త్యాగరాజస్వా మికి బహూకరించడం ఈ మాతృమూర్తికే తెలుసు. ఆ మహాభక్తుడు అయోధ్యా పతిని గానం చేస్తుంటే, ఆ మధురమైన రాగాలతో కెరటాలు నాట్యమాడి పరవ శించిన సంగతి ఈ మనోజ్ఞమూర్తికే తెలుసు. మహాప్రభువు శ్రీరామచంద్రుడు, ఆయన ప్రియపత్ని జానకి, సోదరులు లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, మహాకపి ఆంజనేయుడు – అందరూ ఆకాశంమీద కొలువు దీరి, కీర్తన తరువాత కీర్తన త్యాగరాజు పాడుతుంటే, చెక్కుల మీద కన్నీరు కారగా, వింటున్న వారిని దర్శించి తరించింది కావేరి. ఇవన్నీ ఆమె ఎలా మరిచిపోతుంది?''

ఎన్నో సంగతులు ఆ రాత్రులలో మల్లిక మనసు నుండి వెలువడ్డాయి. కాని,

ఆమె తన గురించి, కనీసం ఎక్కడ ఉంటున్న సంగతి కూడా చెప్పలేదు. బహుశా ఆమె అన్నీ చెప్పేదే – తానే పారిపోయాడు. పది సంవత్సరాలు ముందుకు పరుగులు తీశాయి.

మల్లిక ఆయన మనసునే ఏలుతూనే ఉంది. అందుచేతనే రాజశేఖరం పెళ్లికి విముఖుడిగా ఉండిపోయాడు.

"మల్లికా! నీది చాలా శ్రావ్యమైన గాత్రం. జీవితంలో నువ్వు సంగీత కళానిధివవుతావు" తాను రెండు మూడుసార్లన్నాడు. ఆ విధంగా నేడు ఆమె ఉన్నత స్థానంలో ఉంది.

ఒక వారం రోజులు రాజశేఖరం మనసు మల్లిక మీదే, కాదు కాదు, కావేరీ దేవి గురించే ఆలోచించాడు.

ఒకనాడు పోస్టులో ఆయనకో రిజిస్టరు పార్సెలు వచ్చింది. దానిని జాగ్రత్తగా తెరిస్తే లోపల అయిదు వందల రూపాయ నోట్ల కట్టలు ఒక ఇరవై ఉన్నాయి. వాటితో పాటు ఒక ఉత్తరం కూడా ఉంది.

రాజశేఖరం నోట్ల కట్టలను పక్కకు పెట్టి ఉత్తరం చదువుతూ ఉంటే సేతురామన్ తలుపు తోసుకొని లోపలికి వచ్చాడు.

సేతురామన్ విజిలెన్స్ ఆఫీసరు – రాజశేఖరానికి తెలిసినవాడు. ఏదో పని మీద వచ్చిన వాడు, పని సంగతి మరచిపోయి నోట్ల కట్టలను, తనను కూడా గుర్తించకుండా ఉత్తరం చదవడంలోనే సర్వం మరచిపోయిన బాంకి మేనేజరును చూస్తూ ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

ఒక పదిహేను నిమిషాల మౌనం తరువాత మిత్రులిద్దరూ ఒకరినొకరు పలకరించు కున్నారు. ఎదురుగుండా టేబులు మీద నున్న నోట్ల కట్టలకు సమాధానంగా చేతిలో ఉన్న ఉత్తరం సేతురామన్‌కి ఇచ్చాడు రాజశేఖరం.

రహస్య పత్రాలు చదవడమే వృత్తి అయిన సేతురామన్ ఆ ఉత్తరం అందుకోడంలో సభ్యత ప్రకటించలేదు.

ఉత్తరం ఇలా నడిచింది;

రాజశేఖరం.

నిన్ను చూసి యుగాలయింది. ఈ పది సంవత్సరాల చరిత్ర నాలో చాలా మార్పులు తెచ్చింది. మనిద్దరం అంతవేగంగా ఒకరి గురించి ఒకరు తెలుసుకోకుండా వేరవుతామని అనుకోలేదు. జీవితంలో నీతో గడిపిన అయిదు రోజులు దివ్యమైనవి. నా తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయారు. నేను మా పినతండ్రి దగ్గర పెరిగాను. మనం కలిసేసరికి ఇంటరు పాసయి ఉద్యోగం కోసం టైపు నేర్చుకుంటున్నాను. ఒక సాయంకాలం సంగీత కళాశాల వార్షిక ఉత్సవాలలో లలిత గీతాలు రెండు పాడితే, ముఖ్య అతిథిగా వచ్చిన కమలనాభన్ ఎరవేసి నన్ను వలలో వేసుకున్నాడు. మా పినతండ్రికి కానుకలు, ధనం బాగా ఇచ్చి నాకు అయిదు సంవత్సరాలు జానకి దగ్గిరే గాత్రం నేర్పించాడు. తరువాత కచేరీలు మొదలు పెట్టించాడు. నా ప్రతిభను కాష్ చేసుకున్నాడు. నన్ను పెళ్లాడతానన్నాడు. నాకో బంగళా, కారు, సెక్రటరీ, బ్యూటీషియన్ మొదలైన వాళ్లను నియమించి, సంగీతంలో ఇంకా శిక్షణ ఇప్పించి, మొదటి గానసభ నోటీసులో పెళ్లి చేసుకోకుండానే నా పేరు కావేరీ కమలనాభన్ అని వేసి, ఆ నాటి రాత్రి నుండీ నా చేత వ్యభిచారం చేయిస్తున్నాడు. రాజకీయ నాయకులు, మంత్రులు, బిజినెస్ మాగ్నెట్లు – చాలామంది పై తరగతులవాళ్లను తెస్తున్నాడు. జీవితం మీద ఆశ తీరలేదు. ఆత్మహత్య ఒకటే విముక్తిని ప్రసాదిస్తుంది. కానీ నాకు చచ్చిపోవాలని లేదు. ఈ నరకం నుండి నన్ను తప్పించగలవా? రాజశేఖరం? ఈ డబ్బు నా శరీరం అమ్మగా వచ్చినది. ఏదేనా మంచి పనికి వినియోగించు. మల్లిక".

ఈ ఉత్తరం చదువుతూనే సేతురామన్ ఎగిరి గంతేశాడు.

"రాజశేఖరం! అభయమిస్తున్నాను. మల్లికను విడిపిస్తాను".

వచ్చిన పని మరచిపోయి, ఏమాటా అధికంగా అనకుండా విజిలెన్స్ ఆఫీసరు వెళ్లిపోయాడు.

రాజశేఖరం దిగ్భ్రాంతుడై ఉండిపోయాడు.

మల్లిక బతుకును తలుచుకుంటూ ఆయన కుమిలిపోతున్నాడు. నాలుగు వారాలు గడిచి పోయినా ఆయనలో సంక్షోభం రవంతైనా తగ్గలేదు.

రాజశేఖరం ఆ ఉదయం బాంకుకి రాగానే అకౌంటెంటు దినపత్రిక పట్టుకొచ్చాడు. కమలనాభన్ నడుపుతున్న వ్యభిచార గృహం గురించి, మంత్రి సత్తముడు రెయిడ్‌లో పట్టుబడడం గురించి, ఆయన రాజీనామా గురించి, కమలనాభన్ భార్యల గురించి వార్తలలో ఉంది. రాజశేఖరం మూడుసార్లు చదివాడు, మల్లికపేరు లేక కావేరిదేవి పేరు లేదు. ముగ్గురు భార్యలపేర్లు ఇచ్చాడు. రెయిడ్‌లో కమలనాభన్ పారిపోతుంటే పట్టుకున్నారని, గట్టిదెబ్బలు తగిలాయని కూడా అందులో ఉంది.

మల్లిక ఏమయిందని రాజశేఖరం గాభరా పడుతుంటే, మరో రెండు నెలల తరువాత ఒక శుభలేఖ వచ్చింది. అది అందేసరికి, అయిదురోజుల కిందే పెళ్లి జరిగిపోయింది. మల్లికకు పెళ్లయినట్లు తెలియజేయడమే దాని ప్రయోజనం.

అకౌంటెంటుకు శుభలేఖ చూపించాడు రాజశేఖరం. ఆయన ఆశ్చర్యపోయి అన్నాడు.

"ఈ సేతురామన్ వట్టి అనుమానం పురుగు. వీడి వృత్తే అది. ఎవరినీ నమ్మడు. ఇంకా మరో విశేషం – వీడికి సంగీతమంటే పడనే పడదు. వాడిని పెళ్లి చేసుకుని ఈ అమ్మాయి ఏం సుఖపడుతుంది?"

అకౌంటెంటు వెళ్లిపోయాడు.

కమలనాభన్ డబ్బు చేసుకున్నాడు కాని మల్లిక సంగీతాన్ని అణచి పెట్టలేదు.

రాజశేఖరం తలపట్టుకొని కూర్చున్నాడు. ఏడుస్తున్నాడు. సేతురామన్ ఆమెను నరకం నుంచి విడిపించాడు – సరే – పరిస్థితులను సద్వినియోగం చేసుకున్నాడు. మల్లిక చేతులు మారింది – పెనం మీద నుండి నిప్పులో పడింది – ఆమె గళానికి తాళం పడింది – ఆమె ఇప్పుడు ఎవరికీ అందని కావేరీ సేతురామన్.

★

కవిత

# మౌనమే మేలు



మనసుంటే మార్గముండునా?
దుర్గమ జీవన పోరాటములో స్వర్గముండునా?
ఆచరణ నెరుగని అభ్యుదయానికి
ఆదరణముండునా?
ప్రగతి చూడని ప్రేరణకి
ఫలితముండునా?
చేతలలో చేవలేపుడు
చేసే ప్రయత్నమేలా?
చేయడం చేతకానపుడు
ఏదైనా చెప్పుట మేలా
మనసు చేసే ఆలోచన – మానవీకరణ మొందనపుడు
మనిషిగా కనీస మానవత్వం చూపలేనపుడు
వ్యర్థ వాదన కన్న మౌనధారణే మిన్న
విమర్శే లక్ష్యంగా వున్నపుడు
తల్లి దండ్రులలో కూడ తప్పు కన్పిస్తుంది.
పరిమళ భరిత ప్రకృతంతా చప్పగా అన్పిస్తుంది.
పరులతో పోల్చుకుని నిత్యం దుఃఖాన్నెందుకాహ్వానిస్తావు
స్వల్ప ప్రయోజనాలకై శాశ్వతానందాలనెందుకు దూరం చేసుకొంటావు
స్పందన లేపుడు –,
ప్రతిస్పందనని ఆనందంగా స్వీకరించలేనపుడు
మాట మాటతో యుద్ధం కన్నా – మౌనమే మేలు.
కన్నులతో స్వాగతిస్తే అన్ని కారణాలు
కాంతులీనే కనకాంబరాలు
నేర్చుకున్న అక్షరాలను సంగీతంలో బంధించి చూడు
సరిగమలై సుదూర తీరాలకు చేరవేస్తాయి.
కూర్చుకున్న ఆత్మీయతల్ని బ్రతుకుతో సంధించి చూడు
ఆనందాన్ని శేషంగా మిగులనిస్తాయి.

–వేదుల వాసుదేవరావు